క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను శుక్రవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని, అందులో భాగంగానే కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంతో ఎంతో మంది పేదింటి ఆడబిడ్డలు లబ్ధిపొందుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఎమ్మెల్యే గుర్తుచేశారు. మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, తహసీల్దార్ ఇందిరాదేవి, డీటీ మణిపాల్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్‌లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, అనిల్‌యాదవ్, సిద్ధాల లావణ్య పాల్గొన్నారు.

స్వాగతద్వారం ప్రారంభం



స్వాగత ద్వారాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్ 17వ డివిజన్‌లో శుక్రవారం పీఎల్ఆర్ కాలనీ స్వాగత ద్వారాన్ని మేయర్ పారిజాత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పన్నాల సత్యమ్మ, లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ద్వారాన్ని.. పన్నాల కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డి నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె పన్నాల కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, క్లెం ఎల్లారెడ్డి, పన్నాల కృష్ణారెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి, నరహరిగౌడ్, దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరును మున్సిపాలిటీగా చేయాలి



మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌తో కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కందుకూరును మున్సిపాలిటీగా చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు పలువురు.. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను శుక్రవారం కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలానికి నాలుగో సిటీ రావడంతో ఈ ప్రాంతం మహానగరంగా మారనుందన్నారు. మండలంలో 16 గ్రామాలను విలీనం చేసి, మున్సిపాలిటీగా మారిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. దీనికి స్పందించిన కేఎల్లార్.. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందిస్తామని అయన హామీ ఇచ్చారు. ఇప్పటికే మహేశ్వరం మండల కేంద్రంతో పాటు 12 గ్రామ పంచాయతీలతో కలిపి మున్సిపాలిటీ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, మహేశ్వరం నియోజకవర్గ మహానగరంగా మారబోతుందన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గోగిరెడ్డి లచ్చిరెడ్డి

మంచాల: బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం పార్టీ నిర్మాణంలో ఒక భాగమని, కమలనాథలు సమష్టిగా బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు భాషయ్య, నాయకులు శ్రీ శైలం, నూకం రాజు, రాజేందర్‌రెడ్డి, రాజు గౌడ్, పాండు, ఐలయ్య, రమేష్, శ్రీశైలం,శేఖర్‌రెడ్డి, బద్దునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు గణనాథులు

- నాటి ఉత్సవ వైభవం
- ప్రకృతిని ప్రతిబింబించే గణేశ్ మండపాలు
- అదే ఒరవడిని కొనసాగించాలంటున్న ఉత్సవ కమిటీ
- నేడు వినాయక చవితి



జల్‌పల్లి గ్రామంలో సిద్ధమైన గణేశ్ మండపం



గణనాథుడు

పహాడీషరీఫ్: 'గల్లీకో గణేశ్.. డీజేల హోరు.. యువత జోరు'గా వినాయక చవితి ఉత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి. ప్రజల్లో ఐక్యతను పెంపొందించడానికి స్వాతంత్ర్యానికి ముందు బాలా గంగాధర్ తిలక్ మొదలెట్టిన ఉత్సవాలు.. రోజు రోజుకు కొత్తదనాన్ని సంతరించుకుంటున్నాయి. ఎప్పుడైనా చవితి రోజు పూజ అనంతరం వేడుకలు ప్రారంభమవుతుండగా, ఈ సారి మాత్రం 'గణేశ్ ఆగమన్' పేరుతో గణనాథుడు మండపానికి చేరుకున్న రోజే డీజేల నడుమ ఆటపాటలతో స్వాగతం పలకడం ప్రారంభించారు.

సంప్రదాయాన్ని కాపాడండి..

ఆధునీకరణ పేరుతో సంప్రదాయానికి మంగళం పాడే పరిస్థితి నెలకొంటుందని ఉత్సవ సమితీ పెద్దలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మూడు నాలుగు దశాబ్దాల క్రితం ఉత్సవాలు భక్తి పారవశ్యానికి నిదర్శనంగా నవరాత్రులు నిలిచేవని, ముఖ్యంగా నగర శివారు గ్రామాల్లో ఒకే ఒక్క గణనాథుడిని ప్రతిష్ఠించి ఊరంతా ఐక్యంగా ఉత్సవాలను జరుపుకొనే వారని గుర్తుచేశారు. తొమ్మిరోజుల పాటు మద్యం, మాంసాహారలకు దూరంగా ఉంటూ భజ న కార్యక్రమాలతో బొజ్జ గణపయ్య సేవలో తరించేవారని పేర్కొన్నారు. కొత్తదనాన్ని ఆస్వా దిస్తూనే.. సంప్రదాయాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మికతకు చిహ్నం

నాడు వినాయక మండపాలు ఆధ్యాత్మికతకు చిహ్నంగా నిలిచేవి. కొబ్బరి మట్టలు, అరటి ఆకులతో మండపాన్ని ఏర్పాటు చేసి, పూర్తిగా పూలు, పండ్లతో అలంకరించేవారు. గ్రామంలో పండే ధాన్యం, లభ్యమయ్యే ఫలాలను మండపంలో వేలాడ దీసేవారు. సీతాఫలం, ఎలిగె కాయలు, మారడి ఆకులు, మారడి కాయలు, బంతి, చామంతి, తామర, మొగలి పూలు, జొన్న, రాగి కంకులతో ప్రకృతి మండపాన్ని నిర్మించేవారు. 60 పైసలతో బహదూర్‌పురా జూపార్కులో మొగలి పువ్వును కొనుగోలు చేసి, మామిడిపల్లి గణనాథుడి చేతిలో ఉంచారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

భక్తులందరికీ లడ్డూ ప్రసాదం

ప్రస్తుత ఉత్సవాల్లో గణనాథుడి చేతిలోని లడ్డూ వేలం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. చిన్న పాటి లంబోదరుడి చేతిలోని లడ్డూను వేలం వేయడం పరిపాటిగా మారింది. కానీ ఆ రోజుల్లో తొమ్మిది రోజుల పాటు గణనాథుడి చేతిలోని లడ్డూను నిమజ్జనం రోజున కొబ్బరి ముక్కలతో కలిపి భక్తులందరికీ ప్రసాదంగా పంపిణీ చేసేవారు. నగరంలోని మిఠాయి దుకాణం నుంచి కిలో లడ్డూను కొనుగోలు చేసి, గణనాథుడి చేతిలో పెట్టేవారమని నాటి నిర్వాహకులు తెలిపారు.

మామిడిపల్లిలో తొలిసారిగా..

మామిడిపల్లి గ్రామంలో 1984వ సంవత్సరంలో తొలిసారిగా ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సుమారు 10 అడుగుల ఎత్తులో రంగురంగుల గణనాథుడి ప్రతిమను గ్రామానికి తీసుకురావడంతో ప్రాంత ప్రజలందరూ సంబురపడేవారు. అలా తొమ్మిది రోజుల పాటు గణనాథుడి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో భజనలు, కోలాటాలు, బతుకమ్మ ఆడిపాడేవారు. అనంతరం ఆటపాటలతో గ్రామ శివారులోని కొత్త చెరువు స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేసేవారు. జల్‌పల్లి, పహాడీషరీఫ్ రెండు గ్రామాల కంటే ముందే మామిడిపల్లిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో.. జల్‌పల్లి, పహాడీషరీఫ్ గ్రామాల భక్తులు ఇక్కడికి వచ్చేవారు. తొలి రెండేళ్లపాటు పూజలు, ఉత్సవాల్లో పాల్గొని మూడు గ్రామాల ప్రజలు ఐక్యతను చాటారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

ఆదిబట్ల పుర అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: అభివృద్ధిలో ఆదిబట్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పుర పరిధి ఒకటో వార్డులో రూ.11 లక్షలతో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నానని, ప్రజలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇతర వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, కౌన్సిలర్ లావణ్య, కమిషనర్ బాలకృష్ణ, ఏఈ వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ రాజు, సాయిబాబాగౌడ్, రజినీకాంత్‌గౌడ్, శ్రీశైలం, నర్సింహా, మహేందర్ రెడ్డి, ప్రభాకర్, నరేందర్‌గౌడ్, కోరే నర్సింహులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబయ్య

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందెబాబయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రధాని మోదీ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. వారితో మాట్లాడి చైతన్యవంతులను చేయాలన్నారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలపరచాలన్నారు. ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కక్కునూరి వెంకటేష్‌గుప్తా, మనోహర్‌రెడ్డి, ఎంకనోళ్ల వెంకటేశ్, శ్రీనివాస్, లష్కర్ నాయక్ పాల్గొన్నారు.



ఆర్ఎన్‌రెడ్డినగర్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు నర్సింహ, మమత



కాలనీ వాసులకు విగ్రహాలను పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

మట్టి గణపతులను పూజిద్దాం

మీర్‌పేట: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మీర్‌పేట అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. తమవంతు బాధ్యతగా ఏటా సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అంతే కాకుండా.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వలన పర్యావరణానికి కలిగే అనర్థాలను వివరిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి వెంకటేశ్వర్లు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: ప్రజలందరూ మట్టి గణపతులనే పూజించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. మట్టి గణపతుల ద్వారా నీటి కాలుష్యం, పర్యావరణానికి ఎలాంటి ముప్పుకలగదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కేఎల్ఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

తుర్కయంజాల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధి ఉమర్‌ఖాన్ గూడ, తొర్రూర్, మునగనూర్, బ్రాహ్మణపల్లి, కొహెడలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో మూడు నెలల్లో మున్సిపాలిటి కొత్త కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

తలకొండపల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. శుక్రవారం చీపునుంతల్లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల.. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. వైద్యులు అఖిల్, అనిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 243 మందికి బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, సుధాకర్, శ్రీశైలం, మనోహర్ పాల్గొన్నారు.

పురస్కారం బాధ్యత పెంచింది

ప్రముఖ కవి, రచయిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారం తన బాధ్యను పెంచిందని ప్రముఖ కవి, రచయిత ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల రాకేశ్ భవాని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తెలుగు భాషా, సాహిత్య జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్న రాకేశ్ అనేక పత్ర సమర్పణలు చేశారు. 'తెలుగు సినీ గేయ సాహిత్యం, సమకాలీన సమాజ చిత్రణ 1960–70' అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి 2020లో డాక్టరేట్ పొందారు. 'తానా' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహా కవిసమ్మేళనంలో దేశప్రతినిధిగా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు.

నాడి పట్టే నాథుడే లేడు

- బస్తీ దవాఖానాల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- భగత్‌సింగ్‌నగర్‌లో నర్సు.. అంబేడ్కర్‌నగర్‌లో అటెండర్, ఫార్మసిస్టే దిక్కు
- వైద్యులు లేక వెలవెలబోతున్న వైద్యశాలలు
- ప్రైవేటు ఆస్పత్రులకు బస్తీవాసుల పరుగు



భగత్‌సింగ్‌నగర్ బస్తీ దవాఖానాలో ఖాళీగా వైద్యుడి కుర్చీ

హుడాకాంప్లెక్స్: అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై స్థానిక వైద్యశాలల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత.కొరవడిన వైద్య సేవలు.ఔషధాల లేమితో.. బస్తీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.వైరల్ ఫీవర్, వాంతులు, విరేచనాలు,కడుపునొప్పి,దగ్గు,జలుబు ఇలా ఏదొచ్చినా.. నాడీ పట్టే డాక్టర్ లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి పది కాలనీల్లో సుమా రు 50 వేల మంది నివసిస్తున్నారు. జనాభా ప్రాతిప్రదికన భగత్‌సింగ్‌నగర్,అంబేడ్కర్‌నగర్‌లో గత ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. కానీ సిబ్బంది నియామకం, కనీస వసతుల ఏర్పాటులో విఫలమయింది. దీంతో ఉన్న సిబ్బందితో పాటు.. వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

అటెండరే ఫార్మసిస్టు!

అంబేడ్కర్‌నగర్ బస్తీ దవాఖానలో ఫార్మసిస్ట్ లేక.. వైద్యురాలు రాసిన మందులను అటెండరే ఇస్తున్నారు. భగత్‌సింగ్‌నగర్ ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యుడు ఉన్నత చదువుల కోసం రెండు నెలల క్రితం సెలవులపై వెళ్లాడు. ఇక నాటి ఇప్పటి వరకు ఇక్కడ స్టాఫ్‌నర్సే రోగులకు పెద్ద దిక్కుగా మారింది. ఇలా సరైన వైద్య సిబ్బంది లేక.. రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు కరువయ్యాయి. వైద్యమో నారాయణ అంటూ బస్తీ దవాఖానలకు వచ్చిన వారికి.. అక్కడి సిబ్బంది మందుగోలీలు ఇచ్చి మమ అనిపిస్తున్నారు. దీంతో చేసేది లేక ప్రాంత ప్రజలు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ.. ఆర్థికంగా నష్టపోతున్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో మందులు పంపిణీ చేస్తున్న అటెండర్



వెలవెల బోతున్న అంబేడ్కర్‌నగర్ బస్తీ దవాఖానా

మందు గోలీలు లేవు



భగత్‌సింగ్‌నగర్ బస్తీ దవాఖనలో రెండు నెలలుగా వైద్యుడు లేడు. బీపి, నొప్పి నివారణకు మాత్రలు లేవు. వైరల్ ఫీవర్ కారణంగా ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. దీనికి మందు గోలీలు లేవంటున్నారు.

– ఎండీ జహీర్, స్థానికుడు

చినుకు పడితే.. పాఠశాల మూతే!

- రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి!
- పెచ్చులూడుతున్న భవనం స్లాబు
- పక్క గ్రామానికి మార్చిన అధికారులు
- వరండాలో ఆరుబయట కొనసాగుతున్న తరగతులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు




పులుసుమామిడి పాఠశాల వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

కొందుర్గు: రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి చినుకు పడితే అంతే సంగతులు...ఆ వర్షపునీరంతా పాఠశాల గదుల్లోకి చేరుతుంది. బురదగా తయారవుతుంది. ఇది రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి. కొందుర్గు మండలంలో ఈ ప్రాథమికోన్నత పాఠశాలలో 7 తరగతులకు గాను 52 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. ఇక్కడ హెచ్ఎం రాములమ్మ, ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపునీరంతా గదుల్లో చేరి ఇబ్బందికరంగా మారింది. పాఠశాల గదుల పైకప్పు పెచ్చులూడి వర్షపునీరంతా గదుల్లో చేరుతుంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పులుసుమామిడి పాఠశాలలో కొనసాగించండి..

వర్షం కురిస్తే పాఠశాలను పక్కనే ఉన్న పులుసుమామిడి పాఠశాల భవనంలో కొనసాగించాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా రామచంద్రాపూర్ పాఠశాలను పులుసుమామిడి పాఠశాల భవనంలో నడుపుతున్నారు. పులుసుమామిడి పాఠశాల భవనంలో రెండు గదులు మాత్రమే ఉండటం వల్ల ఒక గదిలో పులుసుమామిడి పాఠశాలకు చెందిన ఐదోతరగతి విద్యార్థులను, మరో గదిలో రామచంద్రాపూర్‌కు చెందిన ఏడోతరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో తమకు ఇక్కడ ఇరుకుగా ఉందని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని, పాఠాలు అర్థం కావడం లేదని వాపోతున్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వర్షంతో తడిసిన తరగతి గది